సాక్షి
నిర్మల్

శనివారం । 9 । ఆగస్టు । 2025

గరిష్టం/కనిష్టం
29.5 /23.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకనాన తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

యూనివర్సిటీ.. సాధిద్దాం!

- ఎన్నాళ్లీ.. 'కాకతీయ' కష్టాలు!? • పీజీసెంటర్‌ను యూనివర్సిటీ చేయాలి • జ్ఞానసరస్వతీ పేరిట కొత్తవర్సిటీ కావాలి
- విశ్వవిద్యాలయం కల సాకారానికి విద్యా విప్లవం • 'సాక్షి' రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యావంతులు



'సాక్షి' నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న విద్యావంతులు

జిల్లాలో ఉన్నత విద్యాభివృద్ధికి స్థానిక విద్యావంతులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఒక్కటై నినదిస్తున్నారు. 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు అవసరాన్ని నొక్కి చెప్పింది. 'అక్షరం సాక్షిగా అందరం ఒక్కటిగా' అనే నినాదంతో, నిర్మల్‌లో 'జ్ఞాన సరస్వతీ యూనివర్సిటీ' స్థాపన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 'సాధించుకుందాం.. విశ్వవిద్యాలయం..' అంటూ విద్యావంతులు, విద్యార్థి సంఘాల నేతలు ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఇప్పటికీ కాకతీయ యూనివర్సిటీ దూరభారంతో ఎదురవుతున్న సమస్యలను, మన ప్రాంతం కోల్పోతున్న విద్యాఫలాలను కళ్లకు కట్టించేలా వివరించారు. జిల్లాలో విశ్వవిద్యాలయం ఆవశ్యకతను అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు వర్సిటీని సాధించుకుంటామని ప్రశ్నించారు. ముందుతరాలు బాగుపడాలన్నా, మన ప్రాంతం ముందడుగు వేయాలన్నా ఇక్కడ యూనివర్సిటీ తప్పనిసరి అని స్పష్టంచేశారు. గతంలో కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేసినట్లే.. ఇప్పటికే నిర్మల్‌లో ఉన్న కాకతీయ పీజీసెంటర్ కేంద్రంగా 'జ్ఞాన సరస్వతీ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ఇందుకు సంబంధించిన కమిటీని ప్రకటిస్తామన్నారు. నిర్మల్ ప్రాంత విద్యాభివృద్ధి విషయంలో 'సాక్షి' తీసుకుంటున్న ప్రత్యేక చొరవను వారంతా ప్రశంసించారు.

– నిర్మల్/నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్

మరో ఉద్యమానికి సిద్ధం..



అలుపెరగని ఉద్యమంతోనే తెలంగాణ సాధించుకున్నాం, ఇప్పుడు అదేతరహాలో జిల్లాలో యూనివర్సిటీ సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం సమష్టిగా కృషిచేద్దాం.

– ఎంసీ లింగన్న, నిర్మల్ సిటీజన్స్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు

పోరాడి సాధించుకుందాం..



జిల్లాలో జ్ఞానసరస్వతీమాత పేరిట యూనివర్సిటీ సాధన కోసం అన్నివర్గాలు స్పందించాలి. పోరాడితేనే విశ్వవిద్యాలయం సాధించుకోగలుగుతాం.

– శివరాజ్, టీపీయూఎస్ రాష్ట్రబాధ్యులు

తేడా స్పష్టంగా తెలుస్తోంది..



కాకతీయ యూనివర్సిటీ ఉన్న వరంగల్‌లో ఎస్జీటీ టీచర్లలోనూ 70 శాతం మంది పీహెచ్‌డీలు ఉన్నారు. అదే మనజిల్లాలో కేవలం 7 శాతమే ఉన్నారు. విశ్వవిద్యాలయం అందుబాటులో ఉంటే సమీప జిల్లాల్లో విద్యాఫలాలు ఎలా ఉంటాయో తేడా స్పష్టంగా తెలుసుకోవచ్చు.

– రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీడీసీ, భైంసా

మహిళలకు దూరం..



మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. కానీ మన ప్రాంతంలో ఇప్పటికే ఉన్న ఉమెన్స్ కాలేజీ వెనక్కి వెళ్లిపోవడం శోచనీయం. యూనివర్సిటీ లేక చాలామంది మహిళలు ఇంటర్, డిగ్రీ వరకే చదివి ఆపేస్తున్నారు.

– అర్చన, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీడీసీ, నిర్మల్

చదువులేక చిన్నచూపు..



మనప్రాంతంలో ఉన్నత విద్య లేక దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. నేను డాక్టర్ చదివేటప్పుడూ మనప్రాంతంపై వివక్ష, చిన్నచూపును గమనించా. అందుకే మనకూ యూనివర్సిటీ కావాల్సిందే.

–డా.కృష్ణంరాజు, సామాజికవేత్త

రాంజీ, భీమ్ స్ఫూర్తితో..



రాంజీగోండ్, కుమురం భీమ్ స్ఫూర్తితో యూనివర్సిటీ సాధన కోసం పోరాడుదాం. ఇందులో అన్నివర్గాలు కలిసి రావాలి.

– ప్రవీణ్, టీజీవీపీ ఉమ్మడిజిల్లా ప్రధానకార్యదర్శి

పూర్వవిద్యార్థిగా బాధపడుతున్న..



పీజీసెంటర్‌లో ఉన్న సోషియాలజీ రెగ్యులర్ కోర్సును తరలించడంపై పూర్వవిద్యార్థిగా బాధపడుతున్నా. వర్సిటీ సాధన కోసం విద్యార్థినేతగా అందరితో కలిసి పోరాడుతా.

– వెంకటేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

న్యాయపరంగా మనజిల్లాకే..



నిర్మల్‌లో యూనివర్సిటీ ఏర్పాటుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే ముందడుగు పడింది. ప్రభుత్వాల మార్పు, బడ్జెట్‌లో నిధులలోటుతో వెనుకబడింది. పీజీసెంటర్ ఉన్న నిర్మల్‌లోనే జ్ఞానసరస్వతీ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి.

–నంగె శ్రీనివాస్, జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ సాధన సమితి వ్యవస్థాపకుడు

ఉన్నతవిద్యలో వెనుకంజ..



జిల్లాలో పదోతరగతి వరకు 99 శాతం, ఇంటర్ 75 శాతం, డిగ్రీ 60 శాతం చదువుతుంటే.. పీజీకి వచ్చేసరికి 25 శాతం కూడా ఉండటం లేదు. అందుకే జిల్లాకు వర్సిటీ అవసరం.

– రాకేశ్, కామర్స్ లెక్చరర్

సమష్టి పోరాడుదాం..



విద్యాపరంగా అభివృద్ధి చెందాలంటే జిల్లాకు విశ్వవిద్యాలయం తప్పనిసరి. అన్నివర్గాలు, రంగాలు సమష్టిగా ఉద్యమించి వర్సిటీని సాధించుకుందాం.

– దర్శనం దేవేందర్, పీడీ

జ్ఞానసరస్వతీ కొలువైన జిల్లా..



మనది జ్ఞానసరస్వతీ కొలువైన జిల్లా. ఇలాంటి చోట వర్సిటీ లేకపోవడం శోచనీయం. యూనివర్సిటీ సాధనను చాలెంజింగ్‌గా తీసుకుని సమష్టిగా సాధిద్దాం.

– జవాద్ హుస్సేన్, టీఎంఈపీ జిల్లా అధ్యక్షుడు

దూరభారంతో చదవలేకపోయా..



చదువులమ్మ కొలువైనా ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడం దారుణం. 1990లోనే ఖమ్మంలో పీజీ సీటు వచ్చినా దూరభారంతో వెళ్లలేకపోయాను.

– జుట్టు చంద్రశేఖర్, న్యాయవాది

ఎన్నో వనరులున్నా..



మన జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు ఎన్నో వనరులు, సౌకర్యాలు, ఆవశ్యకత ఉన్నా.. పట్టింపులేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా విశ్వవిద్యాలయం కోసం ఉద్యమిద్దాం.

– భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

విద్యతోనే అభివృద్ధి..



ఉన్నతవిద్యతోనే మనప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు ఏకమై వర్సిటీని సాధించుకుందాం.

– వెల్మల ప్రభాకర్, టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమాల గడ్డ నిర్మల్..



వరంగల్, కరీంనగర్ తర్వాత నిర్మల్‌కు ఉద్యమాల గడ్డగా పేరు ఉంది. వర్సిటీ సాధనకు ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా ముందుకు రావాలి. 'సాక్షి' తీసుకున్న చొరవ అభినందనీయం.

–రవికాంత్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వివక్షతోనే కోర్సులు దూరం..



విద్యాభివృద్ధి చేయాల్సింది పోయి, వివక్షతో పీజీసెంటర్‌లో ఉన్న కోర్సులు ఎత్తివేయడం దౌర్భాగ్యం. ప్రతీ పార్టీ మేనిఫెస్టోలో వర్సిటీ ఎజెండాగా ఉండాలి.

– సురేందర్, గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్

ఉద్యమాలతోనే సాధ్యం..



తెలంగాణ తరహాలో ఉద్యమాన్ని చేస్తేనే వర్సిటీ ఏర్పాటు సాధ్యమవుతుంది. ఇందులో అన్నివర్గాలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది.

– విజయ్‌కుమార్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి

నిరుద్యోగం తగ్గుతుంది..



విశ్వవిద్యాలయం ఏర్పాటైతే ఉన్నతవిద్య అందుబాటులోకి రావడం తోపాటు నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. మన ప్రాంత పరిశోధనలు వెలుగులోకి వస్తాయి.

– డాక్టర్ వెల్మల రంజిత్, తెలుగు అధ్యాపకుడు, జీడీసీ

ఇప్పటికే ఆలస్యమైంది..



జిల్లాలో వర్సిటీ ఏర్పాటు కోసం పోరాటం చేయడంలో ఇప్పటికే ఆలస్యమైంది. ఇక అందరినీ కలుపుకొని పోరాడుదాం. యూనివర్సిటీ సాధించుకుందాం.

– నూతన్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి

పాలకులు కదిలేలా..



చదువులతల్లి కొలువైన జిల్లాలో ఇప్పటికీ ఉన్నత విద్య అందకపోవడం దారుణం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వర్సిటీ కోసం కదిలేలా ఉద్యమిద్దాం.

– వెంకటేశ్, ఏబీవీపీ

నిర్మల్‌లోనే ఏర్పాటు చేయాలి..



కాకతీయ యూనివర్సిటీ దూరభారమవుతోంది. ఏ చిన్న అవసరమైనా అంత దూరం వెళ్లడం ఇబ్బందవుతోంది. నిర్మల్‌లోనే యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి.

–సుభాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీడీసీ, నిర్మల్

కలిసి ముందుకెళ్దాం..



రాజకీయ నాయకుల నిర్లక్ష్యంతోనే విశ్వవిద్యాలయాలు ప్రశ్నార్థకంగా మారాయి. యూనివర్సిటీ ఏర్పాటు కోసం కలిసికట్టుగా సాగుదాం.

– స్వదేశ్‌పరికిపండ్ల, ఎన్ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ మెంబర్

జయశంకర్‌సార్ స్ఫూర్తితో...



ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో ఐక్యంగా వర్సిటీ కోసం ఉద్యమిద్దాం. పక్కా ప్రణాళికతో సాధించుకుందాం. 'సాక్షి' సామాజిక బాధ్యత అభినందనీయం.

–కిశోర్, సంకల్ప్ వెల్ఫేర్ సొసైటీ

ఉద్యమంతోనే విశ్వవిద్యాలయం..



తెలంగాణ రాష్ట్రం, నిర్మల్ జిల్లాను సాధించుకున్నట్లే ఉద్యమంతోనే విశ్వవిద్యాలయాన్ని సాధించుకుందాం. చదువులమ్మ జిల్లాలో విద్యాభివృద్ధి చేసుకుందాం.

–షేర్ నరేందర్, నిర్మల్ బార్‌అసోసియేషన్ సెక్రెటరీ

జిల్లాకో వర్సిటీ ఉంటే తప్పేంటి..?



పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలను ఏర్పాటు చేసినట్లు, విద్యార్థుల శ్రేయస్సు కోసం జిల్లాకో యూనివర్సిటీ పెడితే తప్పేంటి..!? నిర్మల్ జిల్లాలోనూ వర్సిటీ పెట్టాలి.

– కొమ్మోజి రమణ, న్యాయవాది

వర్సిటీతో ఎన్నోలాభాలు..



విశ్వంలోని సమస్త విషయాలపై పరిశోధనలు చేసి, పరిష్కారాలు చూపేదే విశ్వవిద్యాలయం. అలాంటి వర్సిటీ జిల్లాలో ఉంటే ఎన్నోరకాల లాభాలు ఉంటాయి. స్థానిక విద్యార్థులకు ఉపయోగకరం.

– డా.మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్


న్యూస్‌రీల్

నులిపురుగులను నిర్మూలిద్దాం

- అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతం చేయాలనిఅదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆ రోజు నుంచి 18వ తేదీ వరకు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. జిల్లాలో 1,91,998 మందికి ఈ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు.

విపత్తులపై అవగాహన



మెలకువలు చెబుతున్న వినీత్‌కుమార్

లోకేశ్వరం: గ్రామాల్లో ప్రకృతి విపత్తులు, వరదలు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ వినీత్‌కుమార్ అన్నారు. మండలంలోని గడ్‌చాంద గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం అవగాహన కల్పించారు. నీటిలో కొట్టుకుపోయేటప్పుడు, పిడుగుపాటుకు గురైనప్పుడు, భూకంప వచ్చే సమయంలో తమ ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

కని పారేయకండి..

- 'ఊయల'లో వేయండి..!
- అనాథ శిశువుల కోసం కలెక్టర్ వినూత్న ఆలోచన
- భైంసా ఏరియాస్పత్రిలో ప్రారంభం



ఊయలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

భైంసాటౌన్: నవ మాసాలు తన గర్భంలో మోసిన తల్లి కర్కశంగా వ్యవహరిస్తోంది. తన ఒడిలో వెచ్చగా సేదదీరాల్సిన శిశువును చెత్త కుప్పల్లో, మురికి కాలువలో పారవేస్తోంది. తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసిబిడ్డలు లోకం చూడకుండానే ఊపిరి వదులుతున్నారు. భైంసా పట్టణం నడిబొడ్డున.. నిత్యం జనసంచారం ఉండే ప్రదేశంలో ఓ మృత శిశువును రెండు రోజుల క్రితం డ్రెయినేజీలో పడేయడం స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్ వినూత్న ఆలోచన చేశారు. ఈ మేరకు ఊయల పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్రమ సంబంధాలు, పెళ్లికి ముందే గర్భం దాల్చడం, వారసుడి కోసం వరుసగా గర్భం దాల్చడం, ఆడపిల్ల పుడితే వదిలించుకోవడం చేస్తున్నారు. కొందరు గర్భంలోనే చిదిమేస్తుండగా, మరికొందరు పుట్టిన తరువాత తుప్పల్లో పడేస్తూ వదిలించుకుంటున్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు జరగడం కలవరపాటుకు గురిచేస్తోంది.

'ఊయల'కు శ్రీకారం..
భైంసా పట్టణంలో జరిగిన అమానవీయ ఘటనలు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో 'ఊయల' అనే వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ రూపకల్పన చేశారు. వెంటనే అమలు చేయాలని జిల్లా వైద్యాధికారులకు ఆదేశించారు. దీంతో శుక్రవారం డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్ భైంసాకు చేరుకుని, మృత శిశువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏరియాస్పత్రిలో ఊయల కార్యక్రమం ప్రారంభించారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డలను వద్దనుకునేవారు చెత్త కుప్పల్లో, మురికి కాలువల్లో వేయవద్దని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంటాయని, ఎలాంటి కేసులు ఉండవని భరోసా ఇస్తున్నారు. వారి అనుమతి మేరకు శిశువులను బాలల సంరక్షణ అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

ఊయలలో వేయాలి..

కనిపారేసే శిశువుల సంరక్షణ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు ఊయల కార్యక్రమం ప్రారంభించాం. భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో ఊయల ఏర్పాటు చేశాం. అప్పుడే పుట్టిన తమ శిశువులను వద్దనుకునే తల్లిదండ్రులు ఏరియాస్పత్రిలోని ఊయలలో వేయవచ్చు.

– రాజేందర్, డీఎంహెచ్‌వో, నిర్మల్

వ్యవసాయంలో సాంకేతికతకు నాంది పలకాలి

- డీఏవో అంజిప్రసాద్

సోన్: వ్యవసాయరంగంలో సాంకేతికను స్వాగతించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని జాఫ్రపూర్ గ్రామంలో సాంకేతికతపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో ఏఐ సాంకేతికతతో భూసార పరీక్షలు, అగ్రి ఫ్యాబ్రిక్స్ సంస్థ ఒకే గొడుగు కిందకు వచ్చాయని తెలిపారు. వ్యవసాయ అవసరాలైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు వ్యవసాయ యంత్రాలు, మార్కెటింగ్, సేంద్రియ వ్యవసాయ విధానంలో విలువ ఆధారిత పంటలను ఉత్పత్తి చేయడమే కాకుండా వాటిని బ్రాండ్ చేసి మార్కెట్ చేయాలని వివరించారు. అగ్రి ఫ్యాబ్రిక్స్ సంస్థ సీఈవో మెండు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంస్థ రైతులకు అందించే సేవలు, సంస్థ వెబ్ సైట్ పనిచేసే విధానానంపై అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడాలన్నారు. దుక్కిలో యూరియా, డీఏపీ వేసిన రైతులు మిగతా భాగాన్ని నానో రూపంలో మాత్రమే పిచికారీ చేస్తే పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, ఏఈవో అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

నిర్మల్‌చైన్‌గేట్: 'హర్ ఘర్ తిరంగా యాత్రలో' భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కార్యశాలను శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ విలాస్, కోకన్వీనర్లు నల్ల రవీందర్‌రెడ్డి, శిరం సుష్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి పాల్గొన్నారు.

'రక్షా'ను'బంధం'

- అనుబంధాలనికి ప్రతీక రాఖీ..
- దూర ప్రాంతాలనుంచి స్వస్థలాలకు తోబుట్టువులు

నిర్మల్‌ఖిల్లా: రక్షాబంధనం, భారతీయ సంస్కృతిలో సోదరీ–సోదరుల పవిత్ర బంధానికి చిహ్నం. ఈ పర్వదినాన, సోదరి తన సోదరుని చేతికి రాఖీ కట్టి, రక్షణ హామీని పంచుకుంటూ ప్రేమను వ్యక్తపరుస్తుంది. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర దేశాలు, రాష్ట్రాలు, జిల్లాల్లో ఉంటున్న జిల్లా వాసులు స్వస్థలాలకు తిరిగి వచ్చారు. పెళ్లై అత్తవారింటికి వెళ్లిన ఆడపడుచులు తమ తోబుట్టువులకు రాఖీ కట్టేందుకు తల్లిగారి ఇంటికి చేరారు.

కాలానుగుణ మార్పులు..
ఆధునిక కాలంలో, దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు వీడియో కాల్ ద్వారా రాఖీ వేడుకలను జరుపుతున్నారు. గతంలో కొరియర్ ద్వారా రాఖీలు పంపే సంప్రదాయం మారింది. సాంస్కృతిక విలువలను కాపాడుతూ ఆధునికతను సమన్వయం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో జిల్లాకు చెందిన కొంతమంది రక్షాబంధన్ గురించి, సోదరీ–సోదరుల పవిత్ర బంధానికి సంబంధించి తమ అభిప్రాయాలు వెల్లడించారు.

అన్నయ్య వద్దకు...



నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన జోత్స్న, నాలం శశికాంత్ అన్నచెల్లెళ్లు. ఎక్కడ ఉన్నా రాఖీ పండగ రోజున మాత్రం కచ్చితంగా కలుసుకుంటారు. వివాహం అనంతరం హైదరాబాద్‌లో ఉంటున్న జ్యోత్స్న అన్నయ్యకు రాఖీ కట్టేందుకు నిర్మల్ చేరుకుంది. ఇక వైద్య సేవలో బిజీగా ఉండే డాక్టర్ శశికాంత్ సైతం పండగ కోసం తన చెల్లెలు పుట్టింటికి వచ్చిందన్న సంతోషం చిన్ననాటి జ్ఞాపకాలు కళ్ల ముందు మెదిలేలా చేస్తున్నాయని అంటున్నారు.

రాఖీ కోసం ఢిల్లీకి..



నిర్మల్ టౌన్: నిర్మల్‌కు చెందిన రోహిత్ ఇంటి వద్దనే ఉంటూ.. వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అక్క ఢిల్లీలో ఉంటోంది. అక్కతో రాఖీ కట్టించుకోవడానికి రోహిత్ రైల్లో గురువారం ఢిల్లీ బయల్దేరి వెళ్లాడు. ఏటా అక్కతో రాఖీ కట్టించుకుంటానని వెల్లడించాడు.

ఆత్మీయతకు ప్రతీక రాఖీ..



కుంటాల: అక్క–తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రాఖీ పండుగ. మా తమ్ముడు నవనీత్ కుమార్ కోయంబత్తూర్‌లో డాక్టర్‌గా సేవలందిస్తున్నారు. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి ఉన్న బంధం రాఖీతో ముడిపడి ఉంది. తను రాకున్నా పండుగకు ముందే రాఖీ పంపించి ఆశీర్వదిస్తా.

బహెరాన్‌కు రాఖీ..



లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపల్లి(కె) గ్రామానికి చెందిన జె.వెంకటేశ్ ఉపాధి కోసం బహెరాన్‌లో ఉంటున్నాడు. ప్రస్తుతం అక్కడే ఉన్నాడు. దీంతో చెల్లెలు సుజాత తన అన్నయ్యకు వారం రోజుల ముందుగానే రాఖీని, స్వీట్లను స్పీడ్ పోస్టు ద్వారా పంపి తన అన్నయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది.

క్లుప్తంగా

స్వర్ణ ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత



మూడో గేటు ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

సారంగపూర్: మహారాష్ట్రలో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో అధికారులు మూడో గేటు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు (1.484 టీఎంసీలు) కాగా, ఉదయం 6గంటల వరకు ఏకంగా 80వేల క్యూసెక్కులు రావడంతో 1,182.5 అడుగులకు చేరింది. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్ట్ మూడో గేటు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని వదిలారు. ప్రస్తుతం 1,182.5 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా ఉంచామని ఏఈ మధుపాల్ తెలిపారు.

గడ్డెన్నవాగుకు ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: ఎగువన కురిసిన వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి 1,693 క్యూసెక్కులు వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.60 మీటర్ల నిల్వ ఉంది. ప్రాజెక్ట్ కాలువ ద్వారా 40 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు పంటల సాగుకు వదులుతున్నారు.

బార్ ఉద్యోగిపై దాడిచేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: బార్‌కు వెళ్లి బిల్లు చెల్లించకుండా గందరగోళం సృష్టించి కౌంటర్‌పై ఉన్న వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ లోగల శివ బార్‌లో ఈనెల 11న ఇచ్చోడకు చెందిన జయవంత్‌రావు, ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన సాయినాథ్ మద్యం సేవించారు. రూ.1,850 బిల్లు కాగా రూ.1,500 మాత్రమే ఇచ్చి గొడవకు దిగారు. జాదవ్ శ్రీనివాస్ గ్లాస్‌తో బార్ అకౌంటెంట్ కలీమ్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎడ్లబండి పైనుంచి పడి ఒకరి మృతి

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామానికి చెందిన తనుగుల మల్లయ్య (45) శుక్రవారం ఎడ్లబండి కిందపడి మృతిచెందాడు. మల్లయ్య తన భార్య కవితతో వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్లబండిపై వెళ్తుండగా మార్గమధ్యలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లయ్య ఛాతి పైనుంచి బండి చక్రం వెళ్లగా అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే కవిత 108 లో మల్లయ్యను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతడు చనిపోయినట్లు నిర్ధారించారు. కవిత ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేశారు.

అడవి బిడ్డలు.. సంస్కృతి రక్షకులు

- సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత
- యాస.. భాష పరిరక్షణకు చర్యలు
- భావితరాలకు అందించే యత్నం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ఇంద్రవెల్లి: రాజుల్ దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలకు ఆదివాసీ గిరిజనులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొండ, కోనల నడుమ ప్రకృతితో మమేకమవుతున్నారు. ప్రకృతిని దైవంగా భావించి జీవనం సాగిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార, వ్యవహారాలను పాటిస్తూ వాటిని భావితరాలకు అందిస్తున్నారు. ఏ పని చేసినా, ఈ కార్యం తలపెట్టినా ముందుగా ప్రకృతి దేవతలకు పూజలు చేసే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. వనదేవతలకు పూజలు చేశాకే సాగు పనులు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొలాం, తోటి, నాయక్‌పోడ్, గోండు, పర్ధాన్, అంధ్, లంబాడీ తెగలుగా ఉన్న ఆదివాసీ గిరిజనులు ప్రతీ పండుగ, కుల దేవతల పూజలు, పెళ్లి వేడుకలు ఇలా ఏవైనా వారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వైభవంగా నిర్వహిస్తారు.

ఆదివాసీ తెగలు.. పండుగలు

గోండు, కొలాం, పర్ధాన్, తోటి ఆదివాసీ తెగల వారు కుల దేవతలతోపాటు ప్రకృతి దేవతలను ఆరాధిస్తారు. ఏ పూజ చేసినా.. తరతరాలుగా గ్రామస్తులంతా సామూహికంగా చేసే ఆచారాన్ని పాటిస్తున్నారు. ఆషాఢ మాసం ప్రారంభంలో అకాడి (వన దేవత) పూజలతో మొదలుకుని నాలుగు నెలలపాటు యేత్మసుర్ దేవతలను ఆరాధిస్తారు. శ్రావణ మాసానికి ముందు గావ్ సాత్ పేరుతో పోచమ్మ తల్లికి పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో నెలపాటు గ్రామ దేవతలు శివ బోడి, నొవోంగ్ పూజలను ఘనంగా నిర్వహిస్తారు. దీపావళి సందర్భంగా యేత్మసుర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడీ వేషధారణలతో వారంపాటు సంప్రదాయ వాయిద్యాల మధ్య దండారీ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. వైశాఖ, పుష్య మాసాల్లో సంవత్సరానికి రెండు సార్లు కులదేవతలైన జంగుబాయి, పెర్సాపేన్, భీం దేవుడి పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. పుష్యమాసంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, రాష్ట్రంలో రెండో పండుగైన నాగోబా మహాపూజ, నాగోబా జాతరను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెస్రం వంశీయులు ఘనంగా నిర్వహిస్తారు. అంద్ సమాజ్ ఆదివాసీలు తమ కులగురువు శ్రీశ్రీ సంత్ సద్గురు పులాజీబాబాను ఆరాధిస్తారు. వారివారి గ్రామాల్లో నిర్మించిన ధ్యాన్ మందిరాల్లో ప్రతీ సంవత్సరం వార్షికోత్సవ పూజలు చేస్తారు. నాగుల పంచమి మరుసటిరోజు శీరల్ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అంధ్ ఆదివాసీ సమాజ్ వారి వివాహాలు పులాజీబాబా ధ్యాన్ మందిరాల్లో సామూహికంగా జరిపిస్తారు. నాయక్‌పోడ్ ఆదివాసీ భీమన్న దేవుడిని ఆరాధ్యదైవంగా కొలిచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లంబాడా గిరిజనులు కులగురువు సంత్ సేవలాల్ మహరాజ్‌ను ఆరాధించడంతో పాటు ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమి తరువాత వారంపాటు తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. ప్రతిరోజూ గ్రామాల్లోని ఆలయాల్లో సేవాలాల్, జగదాంబదేవిని ఆరాధిస్తారు.

వాయిద్యాలు.. ప్రత్యేకతలు



ఉట్నూర్‌రూరల్: గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

గోండులు పెర్సాపెన్ పండుగలో దండారీ డప్పుల దరువులతో తుడుం వాయిద్యాన్ని నిర్వహిస్తుంటారు. కొలాంలు పోలకమ్మ పండుగ, భీమయ్యక్ ఉత్సవం (సట్టి దెయ్యాల్), దండారీ, దసరా పండుగల్లో మోగిస్తుండగా, గోండులు జంగుబాయి, పెర్సాపెన్, దండారీ ఉత్సవాల్లో తుడుంను డోలుకు సహ వాయిద్యంగా మోగిస్తుంటారు. అలాగే డెంసా నృత్యాలు చేస్తుంటారు. ఆదివాసీలకు ఒక తరం నుంచి మరొక తరానికి సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వంగా వస్తున్నాయి. తుడుంను పురుషవాద్యంగా భావిస్తారు. ఈ సంగీత వాద్యాన్ని పూజా కార్యక్రమంలో ఉంచి పూజిస్తారు. ఆదివాసీల చైతన్యానికి 'తుడుం' ఒక సంకేతంగా నిలిచింది. ఆదివాసీ ఉద్యమాల్లో ర్యాలీ, ధర్నా లాంటి నిరసన కార్యక్రమాల్లో 'తుడుం' మోగిస్తుంటారు. గోండి పూజారులైన ప్రధాన్లు, తోటి తమ తెగ ఆచారాన్ని పాటిస్తూ జరిపే మత క్రతువులు, కర్మకాండలు, వివాహాలు, చావుల సందర్భంలో దీనిని వాయిస్తారు. గోండి సంప్రదాయాలు, గౌరవానికి ఇది సంకేతం. కిక్రితో పాటు 'పెప్రే' అనే రెండు సన్నాయి వాయిద్యాలు, డక్కి అనే చర్మవాయిద్యం అన్నీ కలిసి సామూహికంగా వాయిస్తారు. డోలు లేని ఆదివాసీ ఊరు ఉండదు. డోలు వాయిద్యానికి ప్రత్యేకమైన జానపద గేయాలు, నృత్యాలు ఉంటాయి. హోలీ, వివాహ వేడుకలకు డోలు నృత్యాలతో కళాకారులు అలరిస్తుంటారు. ఆదివాసీ వ్యక్తి మరణిస్తే అతని దహన సంస్కారాల సందర్భంగా దీనిని వాయిస్తారు. డోలును వివాహ వేడుకల సందర్భంగా రాత్రి వేళ నృత్యాలు చేయడానికి వినియోగిస్తుంటారు. ఒక్కో సందర్భంలో ఒక గ్రామంతో మరో గ్రామం మధ్య పాటల పోటీలు జరుగుతుంటాయి. డోలు వాయిస్తూ పురుషులు స్త్రీ వేషధారణలో, ఒకరు జోకర్‌గా నృత్యాలు చేస్తుంటారు.

యాస.. భాషకు డిజిటల్ రూపం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు మాట్లాడే యాస.. భాష.. సంస్కృతిని డిజిటల్ రూపంలో భద్రపర్చడానికి బోలి చేతో (భాష–చైతన్యం) ఫౌండేషన్ కృషి చేస్తోంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చెరిగిపోకుండా భావితరాలకు అందించడానికి గోండి, కొలామీ భాషలో వికీపీడియా, విక్షనరీలను అంతర్జాలంలో భద్రపర్చి భావితరాలకు భాష, సాహిత్య సంపదను అందించడానికి కార్యశాల నిర్వహిస్తూ ఆదివాసీ యువకులను ప్రోత్సహిస్తోంది. – ఆత్రం మోతీరాం, బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యుడు

గోండి, కొలామి భాష పరిరక్షణలో..



ఆదిలాబాద్ రూరల్: మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ గోండి, కొలామి భాషల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి రోబోటిక్ టెక్నాలజీ కంప్యూటర్ ద్వారా యాంకర్‌ను తయారు చేసి గోండి భాషలో వార్తలు చదివిస్తున్నారు. గోండి, కొలామి, తెలుగు, హిందీ, ఆంగ్లం, లంబాడా భాషల్లో వందలాది పాటలు రాసి ఏఐలో పొందుపర్చారు. మహాభారత గ్రంథాన్ని తెలుగు లిపితో గోండి భాషలో అనువదించారు. 18 పర్వాలు నాలుగు నెలలపాటు అనువదించి వంద పుస్తకాలు ప్రచురితం చేశారు. మన్‌కీబాత్‌లో పీఎం మోదీ కైలాస్‌ను ప్రశంసించారు. అప్పటి కలెక్టర్లు దివ్యదేవరాజన్, దేవసేన, ప్రస్తుత కలెక్టర్ రాజర్షిషా కైలాస్‌ను అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాల రక్షణలో..



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవితరాలకు అందించేందుకు పాండి పారీ కుప్పర్ లింగో హీరా సుకా దేవతల వేషధారణలతో ఆటపాటలతో మెస్రం రేలా రవి కృషి చేస్తున్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా గోండి ధర్మాన్ని కాపాడుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని యువకుడు మృతి



యశ్వంత్ మృతదేహం

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారి మాటేగాం సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ద్విచక్రవాహనంతో ఢీకొని యశ్వంత్ (21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేండ్‌పెల్లి గ్రామానికి చెందిన యశ్వంత్, కుంసర గ్రామానికి చెందిన విలాస్ శుక్రవారం భైంసాకు వచ్చారు. పనులు ముగించుకుని భైంసా నుంచి ద్విచక్రవాహనంపై పేండ్‌పెల్లికి వెళ్తున్నారు. మాటేగాం గ్రామ సమీపంలో రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీ పంక్చర్ కావడంతో అక్కడే నిలిపి ఉంచారు. రోడ్డుపై ఉన్న ట్రాలీని వీరు ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయాలపాలైన క్షతగాత్రులను 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా పేండ్‌పెల్లికి చెందిన యశ్వంత్ మృతి చెందాడు.

పార్డి(బి) గ్రామంలో..



సచిన్ (ఫైల్)

కుభీర్: మండలంలోని పార్డి (బీ) గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగశివుని తండాకు చెందిన పవార్ సచిన్ అనే యువకుడు మృతి చెందాడు. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సచిన్ తన బైక్‌పై సాయంత్రం కుభీర్ సంతకు వస్తుండగా పార్డి(బీ) సమీపంలో పంది తగిలి క్రిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని భైంసాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. అతడి భార్య సిమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కూతురు, తల్లితండ్రులు ఉన్నారు.

పాము కాటుకు యువకుడి మృతి



మహేశ్(ఫైల్)

దహెగాం: పాము కాటుకు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో ని పంబాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పంబాపూర్ గ్రామానికి చెందిన కంబాల మహేశ్ (22) ఈనెల 2న ఇంట్లో ఉండగా లగ్గాం గ్రామానికి చెందిన బాబా అనే వ్యక్తి ఫోన్ చేసి బాత్రూమ్‌లో పాము ఉంది కొట్టడానికి రావాలని పిలిచాడు. దీంతో మహేశ్ వెంటనే బాబా ఇంటికి వెళ్లి బాత్రూమ్ డోర్ తీస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే మహేశ్ కుటుంబీకులకు విషయం తెలుపగా దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తీసుకువెళ్లారు. అక్కడి నుండి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మహేశ్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి పెదనాన్న పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

జన్నారం: జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోటిగూడకు చెందిన గాలి నాగేశం (40) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లి పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చడానికి భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయినా అప్పు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 5న మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, కూతురు, కొడుకు ఉన్నారు. విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

దహెగాం: మండలంలోని పీకలగుండం సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. పీకలగుండం సమీపంలో కల్వాడ గ్రామానికి చెందిన అజ్మీర రాములు అనే వ్యక్తి సురేశ్‌కు చెందిన ఆటోలో 20 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనం చేసుకుని రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై లోభానంద్, సిబ్బంది సురేశ్ ఉన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని బడ్‌గాం గ్రామానికి చెందిన షానే మరీబా (84) అనే వృద్ధుడు గడ్డి మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. షానే మరీబా భార్య ఏడాది క్రితం మృతి చెందింది. అప్పటినుంచి కుమారుడి వద్ద ఉంటున్నాడు. ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే భైంసా ఏరియా స్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు పరమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ప్రసన్నాంజనేయనగర్‌కు చెందిన గంగాధరి వాణి (44) అనే మహిళ అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం దేవాపూర్‌కు చెందిన శంకర్‌తో వాణి వివాహం జరిగింది. కొంతకాలంగా శంకర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో వాణి టైలరింగ్ పని చేస్తూ ఇంటి భారాన్ని మోసింది. తనకు వచ్చే డబ్బులు సరిపోకపోవడం, అప్పులు ఉండడంతో మనోవేదనకు గురై ఈనెల 6న మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గమనించిన భర్త వెంటనే గ్రామంలోని కంపెనీ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించగా కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిస్తుండగా రాత్రి మృతిచెందింది. మృతురాలికి 11 ఏళ్ల కొడుకు విజ్ఞతేజ్ ఉన్నాడు. మృతురాలి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటాలలో భారీ వర్షం



వెంకూర్‌లో లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు



మెదన్‌పూర్‌లో నీట మునిగిన పత్తిని చూపిస్తున్న రైతు చిన్న రాజన్న

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం వేకువ జామున భారీ వర్షం కురిసింది. వాగులు ఉప్పొంగాయి. చేలల్లో నీరు నిలిచింది. పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. సూర్యాపూర్ నుంచి కల్లూరు వాగు పక్కనున్న పంటల్లో వరద నిలిచి పంటలు దెబ్బ తిన్నట్లు రైతులు తెలిపారు. మండలంలో 51.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సాయి కృష్ణ తెలిపారు.

నిలిచిన రాకపోకలు

మండలంలో కురిసిన వర్షంతోపాటు మహారాష్ట్రలో కూడా వర్షం కురవడంతో సూర్యాపూర్ చెరువు నిండిపోవడంతో పాత వెంకూర్ లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో పాత వెంకూర్–కొత్త వెంకూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాత వెంకూర్ గ్రామస్తులు కుంటాలకు ఓలా మీదుగా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎస్సై అశోక్ పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేశారు.

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న సీసీఎఫ్



హారతి తీసుకుంటున్న సీసీఎఫ్ శరవణన్, ఆయన కుటుంబ సభ్యులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన సీసీఎఫ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అభిషేకం, హారతి అనంతరం ఆయన కుటుంబ సభ్యులను సత్కరించారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణారావు, డీఆర్‌వోలు నజీర్‌ఖాన్, సంతోష్‌కుమార్, ఎఫ్‌బీవోలు వెన్నెల, సుజాత ఉన్నారు.

'వృక్ష' రక్షా బంధన్



ఆకులతో తయారుచేసిన రాఖీలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని ఈద్‌గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'వృక్ష రక్షాబంధన్' నిర్వహించారు. నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయ కర్త మోహన్‌రావు, ఉపాధ్యాయుల సహకారంతో తాము తయారుచేసిన సహజసిద్ధమైన రాఖీలను విద్యార్థులు చెట్లకు కట్టారు. 'నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష', 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ ఆ రాఖీలపై రాసి చెట్లను కాపాడుకోవాలని సందేశాన్నిచ్చారు. ఇందులో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ మోహన్‌రావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రాజు, కృష్ణకుమార్, వివేక్, ఉజ్వల, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

రెబ్బెన: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మండలంలోని నంబాలకు చెందిన రత్నం నారాయణ (47) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే నారాయణ పదేళ్లుగా షుగర్‌తో బాధ పడుతున్నాడు. ఇటీవల మరికొన్ని అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. అనారోగ్య సమస్యలు భరించలేక చనిపోవాలని ఉందని తరచూ కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి తనకు అస్వస్థత ఉన్నట్లు భార్య ప్రమీలకు తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు నారాయణను రెబ్బెన పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.